

పంట కాలువలో తూడు తొలగింపునకు చర్యలు



పనులు పరిశీలిస్తున్న గంగరాజు

ప్రజాశక్తి - ఆలమూరు

రైతుల సహకారంతో పంట కాలువకు ఇరువైపులా ఉన్న గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు తొలగింపు చర్యలు చేపట్టామని నీటి సంఘం అధ్యక్షుడు వైట్ల గంగరాజు అన్నారు. స్థానిక సంఘం పరిధిలోప్రధాన పంట కాలువలో శుభ్రత పనులను శుక్రవారం ఆయన పర్యవేక్షిస్తూ, మందులతో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన ప్రభుత్వ కాలంలో కాలువల్లో గుర్రపుడెక్క, చెత్తతో నిండిన మాట వాస్తవమే అన్నారు. కాలువలో వ్యర్థాలను తొలగిస్తున్నామనిఅన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బుంగ కుమార్, దేశభక్తుల సత్యనారాయణ,మట్టా రామకృష్ణ, వాకా వెంకటేశ్వర్లు, అత్తిలి జగదీష్, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పైనే ఆశలు

- రైలుకూత కోసం కోనసీమ వాసుల ఎదురుచూపులు
- కాకినాడ సెజ్‌లో కానరాని పరిశ్రమలు
- పెట్రో కెమికల్ కాంప్లెక్ నిర్మాణంతో ఉపాధి
- పిఠాపురం-కాకినాడ మెయిన్ లైన్ హామీ అమలయ్యేనా.!



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పదేళ్ల దాటినప్పటికీ బడ్జెట్‌లో జిల్లాకు ఒరిగిందేమీ కనిపించడం లేదు. గత బడ్జెట్లలో కేటాయింపులు చూస్తే ఈ విషయం ఇట్టే అర్థమవుతుంది. ప్రతిసారీ గంపెడు ఆశలు పెట్టుకోవడం, బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత నిరాశకు గురవడం షరా మామూలుగానే జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎపికి ఇప్పుడైనా న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాలు అమలుకు నిధులు కేటాయిస్తారని ఇక్కడి ప్రజలకు ఆశిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సారథ్యంలో భారీగా నిధులు కేటాయిస్తారని ఎన్నికలకు ముందు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కూడా బిజెపిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నేరుగా ప్రధాన మంత్రి మోడీతో సత్సంబంధాలు కలిగిన పవన్ ఈసారి ఏపీకి ఏ విధమైన నిధులను తీసుకొచ్చేందుకు కృషి చేశారనేది చర్చనీయాంశంగా మారింది. పిఠాపురం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన జిల్లాలో సుదీర్ఘ సమస్యల పరిష్కారానికి ఎలాంటి నిధులను రప్పించనున్నారో నేటి బడ్జెట్తోతో తెలిసిపోనుంది.

1999లో యువి.కృష్ణంరాజు కాకినాడ ఎంపిగా ఉన్న సమయంలో కాకినాడ- పిఠాపురం రైల్వే మెయిన్ లైన్‌కు అప్పటి ఎన్‌డిఎ ప్రభుత్వ బడ్జెట్‌లో స్థానం ఇచ్చింది. అదే రీతిగా ఇప్పుడు కూటమిలో భాగస్వామిగా వున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రైల్వే మెయిన్ లైన్‌కు కృషి చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కాకినాడ నగరాన్ని విశాఖ-విజయవాడ మెయిన్ రైల్వేలైన్లోకి తీసుకువచ్చేందుకుగాను పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపం నుంచి ప్రత్యేకంగా రైలుమార్గాన్ని నిర్మించి కాకినాడను కలుపుకొంటూ సామర్లకోట రైల్వేలైను మార్గంలో కలపాల్సి ఉంది. 21.5 కిలోమీటర్లు ఉండే ఈ లైనుకు 2017-18లో రూ.400కోట్ల అంచనాకు చేరుకుంది. ప్రస్తుతం పెరిగిన భూసేకరణ వ్యయంతో ఇతర రేట్లను పరిగణనలోకి తీసుకుంటే ఇది రూ.1200-1500కోట్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేది వద్ద డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు అంశం ఈ బడ్జెట్ లో ప్రస్తావనకు వస్తుందని ఇక్కడి ప్రజలు ఆశిస్తున్నారు. కాకినాడ-కోటిపల్లి రైల్వే లైను పునరుద్ధరించాలని కోరుతున్నారు. రాష్ట్ర వాటా పేరుతో కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో కోటిపల్లి - నర్సాపురంరైలు కూడా నిలిచిపోయింది. దీంతో కోనసీమ ప్రాంతానికి రైలు కూత నేటికీ వినిపడలేదు.

కాకినాడ జిల్లా కేంద్రం అభివద్ధికి స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ మరో రెండేళ్ల గడువు పొడిగించే ప్రక్రియకు శ్రీకారం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కీలకమైన పెట్రో కారిడార్, భారతమాల ప్రాజెక్టులో భాగంగా ఆరు లైన్ల రోడ్లు, రిఫైనరీ, కేప్టివ్ పోర్ట్స్, టెర్మినల్స్ ఇలా ఎన్నో ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం ముందు ఉన్నాయి. వాటిపై ఈ సారి ఎటువంటి ప్రకటన వస్తుందో చూడాలి.

పోలవరాన్ని పట్టించుకుంటారా..?

భారీ ప్రాజెక్టు పోలవరాన్ని ఈసారి బడ్జెట్లో కేంద్రం ఏ విధంగా పట్టించుకుంటుందనేది కీలకంగా మారింది. గత బడ్జెట్లో నిధుల కేటాయింపుపై నిర్దిష్టమైన హామీ ఇవ్వలేదు. నిర్వాసితుల సమస్యలు గిరిజనుల పునరావాసం వంటి అంశాలపై ఈసారైనా స్పష్టమైన హామీ తోపాటుగా పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో తాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు అవసరమైన ఏడమ కాలువ పనులు ఏళ్లగా ముందుకు సాగడం లేదు. నిధుల కొరతతో అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. మరోవైపు నిర్వాసితులకు పరిహారం అందించడానికి ఇప్పటికైనా నిధులు కేటాయిస్తారా అనేది చూడాలి.

పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేనా.?

రూ.32 కోట్ల నిధులతో కాకినాడ పెట్రో కారిడార్ పేరుతో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని ఎన్నో ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇస్తున్నా ఎప్పుడూ రిక్తహస్తమే చూపుతున్నారు. కాకినాడ, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో సుమారు 14 వేల ఎకరాలను పరిశ్రమల కోసం కేటాయించారు. కాని ఎలాంటి పరిశ్రమలూ రాలేదు. తాజాగా ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లోనైనా పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన నిర్ణయం ప్రకటిస్తారని జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇక్కడ పెట్రో కారిడార్ కనుక ఏర్పాటు అయితే వేల మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఉపాధి లభించే అవకాశం ఉంది.

గోదావరి పుష్కరాలకు నిధుల కేటాయించేనా?

2027లో గోదావరికి పుష్కరాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో పర్యాటకులకు సరైన వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రోడ్లు, ఘాట్ల ఆధునీకీకరణ, రోడ్ల విస్తరణ, విశ్రాంతి భవనాల ఏర్పాటు, ఇతర ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. దాదాపు రెండు కోట్ల మంది సందర్శకులు పుష్కరాలకు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తుంది. వారికి మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు తప్పని సరి. ఇప్పటి నుంచి పనులు మొదలు పెడితేనే అప్పటికి పూర్తవుతాయి. కేంద్రం ఈ బడ్జెట్‌లో పుష్కరాలకు ఎలాంటి నిధులు కేటాయిస్తుందో అందరూ ఎదురు చూస్తున్నారు.

కార్మికుల సంక్షేమం కోసం ఈ-శ్రమ్ పోర్టల్

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

భారత ప్రభుత్వ కార్మిక శాఖ అసంఘటిత రంగ ఇఎస్ఐ, ఇపిఎఫ్ సభ్యత్వాలు లేని కార్మికుల సంక్షేమం కాంక్షిస్తూ నమోదు ప్రక్రియ కొరకు ఈ-శ్రమ్ పోర్టల్ ను ప్రవేశపెట్టిందనికలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో ఇఎస్ఐ, ఇపిఎఫ్ లేని వివిధ శాఖలలో పని చేస్తున్న కంటింజెంట్ ఎన్ఎంఆర్, పారిశుధ్య ఎస్ఐ, పిఎఫ్ లేని అసంఘటిత కార్మికుల వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ - శ్రమ పోర్టల్లో నమో దు చేస్తూ కార్డులు జనరేట్ చేస్తూ సంక్షేమానికి ప్రమాద బీమా రూ.రెండు లక్షల వరకు ఉచితంగా పొందేందుకు పాటు పడాలన్నారు. సహాయ లేబర్ కమిషనర్ టి నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా ఉప కార్మిక శాఖ వారి కార్యాలయ ములలో లేబర్ ఫెసిలి టేషన్ సెంటర్ ఏర్పాటు చేసి కార్మికులకు సహకారం అందిం స్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వసతులు, మౌలిక సదుపాయాలు ఉండాలి

జిల్లాలోని సాంఘిక సంక్షేమ వెనుకబడిన తరగతుల వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలో అన్ని వసతులు, మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా ఆధునికీకరణ చేపట్టిన సర్వే ప్రతిపాదనలు కాంపోనెంట్ వారిగా విద్యార్థుల దామాషా ప్రాతిపదికన రూపొందించాలని కలెక్టర్ ఇంజినీర్లను, సంక్షేమ అధికారులను ఆదేశిం చారు. కార్యక్రమంలో విద్యా సంక్షేమశాఖ డివిజనల్ ఇంజినీర్ సుబ్బరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ పంచాయతీరాజ్ ఆర్అండ్‌బి ఇంజినీర్లు, వివిధ వసతి గృహాల సంక్షేమ అధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడ ఫ్లయ్ఓవర్ నిర్మాణ పనులు పున: ప్రారంభించాలి

జొన్నాడ ఫ్లయ్ఓవర్ నిర్మాణ పనులు వారం రోజుల్లో పూర్తిస్థాయిలో పున: ప్రారంభించాలని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సంబంధిత గుత్తేదారులు, రహదారులు భవనాలశాఖ జాతీయ రహదారుల ఇంజినీర్లను ఆదేశించారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు గుత్తేదారులు ఇంజినీర్లతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఫ్లయ్ఓవర్ పనుల పురోగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 14, 15, తేదీలలో ఫ్లయ్ఓవర్ నిర్మాణ పనులను పరిశీలిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా పథక సంచాలకులు డి.సురేంద్రనాథ్, సృష్టి కాంట్రాక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.రామకృష్ణ, టీం లీడర్ కన్సల్టెన్సీ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఒ విజయ్ కుమార్

ప్రజాశక్తి - అంబాజీపేట

పుల్లేటికుర్రు పంచాయతీ వద్ద అంబాజీపేట వ్యవసాయ శాఖ ఆద్వర్యంలో శుక్రవారం పొలం బడి కార్యక్రమం లో భాగంగా మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహనా సదస్సు నిర్వహించారు. వరి సాగులో ఎరువుల వాడకం యాజమాన్యం గురించి మండల వ్యవసాయాధికారి సిహెచ్‌డి.విజయకుమార్ వివరించారు. తక్కువ పురుగు మందులు వాడి వరిసాగు చేసిన రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అంతర్జాతీయ వరి పరిశోధనా ప్రతినిధి అఖిల్ యాదవ్ (ఐఆర్ఆర్ఐ) తరపున నీటి యాజమాన్యం పై ప్రాజెక్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపిటిసి సభ్యుడు పబ్బినీడి రాంబాబు, వార్డు సభ్యులు అకెల్ల సూర్యనారాయణ, రైతులు చీకురుమెల్లి సత్యనారాయణ, నూకపెయ్యి సత్యనారాయణ వర్మ, బళ్ల దామోదరరావు, ఎఇఒ దుర్గారావు, విఎఎలు పాల్గొన్నారు.


పాల్గొన్న న్యాయవాదులు తదితరులు

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - కె.గంగవరం

మండల కేంద్రం కె.గంగవరంలో శుక్రవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జాతీయ మహిళా కమిషన్ ఆదేశాలతో రామచంద్రపురం లోని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో న్యాయవాది సత్యనారాయణ, మహిళా న్యాయవాది సత్యవేణి మాట్లాడారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు తదితర విషయాలను వివరించారు. ఆర్థిక స్తోమత లేని మహిళలకు న్యాయస్థానాలు అందించేందుకు న్యాయ సేవ సంస్థలు ఆసరాగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో దొమ్మలపాటి సత్యనారాయణ, కెవిఎ సత్యవేణి, మండల మహిళా సమాఖ్య సభ్యులు ఈ కార్యక్రమంలో హాజరయ్యారు.

వాసవీ అమ్మవారికి పట్టువస్త్రాల అందజేత

ప్రజాశక్తి - కొత్తపేట

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజు సందర్భంగా కొత్తపేటలోని వాసవీ అమ్మవారి ఆలయంలో స్థానిక ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పట్టు వస్త్రాలను సమర్పించారు. తొలుత పూర్ణకుంభంతో ఎంఎల్ఎకు స్వాగతం పలికిన అనంతరం అమ్మవారిని దర్శించుకొని పూజలు చేసి పట్టు వస్త్రాలను అందజేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సహకరించాలి


రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న డిఆర్ఒ

ప్రజాశక్తి - అమలాపురం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు సజావుగా నిర్వహిం చేందుకు రాజకీయ పార్టీలు సహక రించాలని జిల్లా రెవెన్యూ అధికారిని బిఎల్ఎన్. రాజ కుమారి కోరారు . శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని డిఆర్ఒ ఛాంబర్ నందు జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పట్టభద్రులు నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలు విధి విధానాలను ఆమె విశదీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల కు సంబంధించి ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. ఫిబ్రవరి 10 వరకు నామినేషన్లను కాకినాడ కలెక్టరేట్ నందు స్వీకరిస్తారన్నారు. ఫిబ్రవరి 11న నామినేషన్ల ఉపసంహ రణ తేదీగా నిర్ధారించార న్నారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుండి సాయం త్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారని తెలిపారు. మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహిస్తారని ఎన్నికల ప్రక్రియ మార్చి ఎనిమిదో తేదీతో ముగుస్తుందన్నా రు. జిల్లావ్యాప్తంగా ఇప్ప టివరకు 64,327 మంది పట్టభద్రులు నమోదు అయ్యారని వీరిలో పురుషులు 37,069 మంది కాగా మహిళలు 27,256 మంది, ట్రాన్స్ జెండర్స్ ఇద్దరు ఉన్నా రన్నారు. వీరి ఓటింగ్ ప్రక్రియ నిర్వహణ కొరకు జిల్లా వ్యాప్తంగా 95 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆలమూరు మండలంలో 3, మండపేట 8, కపిలేశ్వరపురం మూడు, రాయవరం 2, రామచంద్రపురం 7, కె.గంగవరం 3, ఆత్రేయపురం 3, రావులపాలెం 5, ఐ.పోలవరం 4, ముమ్మిడివరం 5, అయినవిల్లి 3, కొత్తపేట 6, పి. గన్నవరం 4, అంబాజీపేట 3, అమలాపురం 10, మామిడికుదురు 4, రాజోలు 5, మల్కిపురం 4, సఖినేటిపల్లి 4, అల్లవరం 3, ఉప్పలగుప్తం 3, కాట్రేనికోన 3, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. రాజకీయ ప్రతినిధులకు ఏ విధమైన ఎన్నికల సమాచారం కావాలన్న కలెక్టరేట్ కార్యాలయ ఎన్నికల విభాగం నుంచి పొందవచ్చునని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున వడ్డీ నాగేశ్వరరావు, సిపిఎం తరపున కారం వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ తరపున వై. నాగ సతీష్, డాక్టర్ నాగ మానస, బిజెపి తరపున దూరి రాజేష్, సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఉప తహశీల్దార్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాజు

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కలవచర్లలో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ వడ్డి వెంకన్నతో కలసి శుక్రవారం ఎంపిడిఒ, ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎ.రాజు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా వివిధ గ్రామాల్లో జరుగుతున్న సిసి రోడ్లు, డ్రైన్లు నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలన్నారు. ఈ రహదారికి ఎంపిపి నిధులు రూ. 5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఇవి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ వ్యవస్థ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఓబ్బిలిరెడ్డి వేణి, సచివాలయ సిబ్బంది, నిర్మాణ సిబ్బంది పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపిడిఒ భీమారావు

ఎస్‌సి వెల్ఫేర్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అయినవిల్లి

మండల అభివృద్ధి అధికారి జి.భీమారావు చేతుల మీదుగా ఎపి ఎస్‌సి వెల్ఫేర్ జిల్లా క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వెల్ఫేర్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎస్‌సిడబ్ల్యుఎ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగారాజు, అసోసియేట్ అధ్యక్షులు నేరేడిమిల్లి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి బి.అబ్బులు, అయినవిల్లి సెక్రటరీ రామ చంద్రరావు, సభ్యులు చంద్ర, ఆర్థిక కార్యదర్శి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలరావు సేవలు ప్రశంసనీయం


ఉద్యోగ విరమణ చేసిన ఎంఇఒ-2 తిరుమలరావును సత్కరిస్తునన డిఇఒ, ఉద్యోగులు

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండల విద్యాశాఖ అధికారి కొయ్యాన తిరుమలరావు సేవలు ప్రశంసనీయమని పలువురు అన్నారు. ఐ.పోలవరం ఎంఇఒ-2 శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఐ.పోలవరం మండలం మురమళ్ళ హైస్కూల్ వద్ద వీడ్కోలు సభ నిర్వహించారు. యుటిఎఫ్, ఎస్‌టియు, ఎపిటిఎఫ్ అధ్యక్షులు అప్పా డి.వెంకటేశ్వరావు, ఆకెళ్ల సూర్యమోహన్, మడికి నాగభూషణం ఆధ్వర్యంలో ఎంఇఒ-1 ఎన్.కొండారెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీమ్ బాషా హాజరై ఎంఇఒ-2 తిరుమలరావు సేవలు కొనియాడారు. తిరుమలరావును పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు, ఉద్యోగులు, ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి జి.సూర్యప్రకాశం, రామచంద్రపురం ఉపవిద్యాశాఖధికారి రామలక్ష్మణమూర్తి, సిఎంఒ సుబ్రహ్మణ్యం, ఎఎంఒ రాంబాబు మండల నోడల్ ప్రధానోపాధ్యాయులు కె.వెంకటాచార్య, రేవు అప్పలస్వామి, పి.ఏడుకొండలు, ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన డిఇఒ

మురమళ్ల హైస్కూల్ వద్ద శుక్రవారం ఎంఇఒ కె.తిరుమలరావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో డిఇఒ షేక్ సలీమ్ భాషా పాల్గొన్నారు. అనంతరం అక్కడ ఉన్న టెన్త్ విద్యార్థుల తరగతిగదిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. టెన్త్ విద్యార్థులను పలు ప్రశ్నలను వేసి సమాధాన్ని తెలుసుకొని పుస్తకాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు.


సదస్సులో మాట్లాడుతున్న రూరల్ సిఐ

విద్యతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - మండపేట

విద్యను అభ్యసించడం ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమని మండపేట రూరల్ సిఐ పి.దొరరాజు అన్నారు. అర్తమూరు సత్య భాస్కర జడ్‌పి హైస్కూల్లో విద్యార్థులతో ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాల దుర్వినియోగం, రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా సదస్సులో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. చదువుకునే వయస్సులో చదువుపై పెట్టే శ్రద్ధ భవిష్యత్తు నిర్ణయిస్తుందనిసీఐ అన్నారు. చెడు స్నేహాలకు వెళ్లకుండా బాగా చదువుకొని అనుకున్న లక్ష్యాలను చేరుకుని ఉన్నత విలువలు గల వ్యక్తులుగా రాణించాలన్నారు. విద్యార్థి దశలో సోషల్ మీడియా జోలికి వెళ్లి కాలాన్ని వృథా చేసుకోవద్దన్నారు. వచ్చే పబ్లిక్ పరీక్షలకు కాలయాపన లేకుండా శ్రద్ధగా చదివి మంచి మార్కులుతో ఉత్తీర్ణులు అవ్వాలని అన్నారు. మత్తుకు సంబంధించినటు వంటి చెడు వ్యసనాలకు బానిస కావద్దని అన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమ ంలో రూరల్ ఎస్ఐ బుచ్చిబాబు, పాఠశాల అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి, పాఠశాల పరిశీలన కమిటి అధ్యక్షులు నల్లమిల్లి వీరెడ్డి, పాఠశాల హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

భీమనపల్లి శ్రీ శిరంగు రంగనాయకమ్మ జడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆ పాఠశాలలో శుక్రవారం అందజేశారు. హెచ్ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తురగా సీతమ్మ, అయ్యగారి సత్యవతి, గిడుగు లక్ష్మీదేవి సోదరీమణుల జ్ఞాపకార్థం వారి సోదరుడు గిడుగు సత్యనారాయణ ఈ స్టడీ మెటీరియల్‌ను సమకూర్చారు. త్వరలో నిర్వహించనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్న ఉద్దేశంతో స్టడీ మెటీరియల్ అందజేసినట్టు దాత సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ గుర్లింక చిన్న, ఉపాధ్యాయులు అరవ నాయుడు, నడింపల్లి పద్మనాభన్, లక్ష్మి, పచ్చిమాల శివనాగరాజు, ముత్యాల నరసింహమూర్తి, వేటూరి వెంకటేశ్వరరావు, సుబ్బారావు, పీడీ, కామన మధుసూదనరావు పాల్గొన్నారు.


పదో తరగతి విద్యార్థులకు అందజేస్తున్న స్టడీ మెటీరియల్


నిత్యావసరాలు, నగదును అందిస్తున్న జనసేన నాయకులు

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - అల్లవరం

దేవగుప్తం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బుంగా చిట్టిబాబు కుటుంబానికి మండలం జనసేన పార్టీ తరపున 25 కేజీల బియ్యం, కూరగాయలు, రూ.8వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ మెంబర్ కటికరెడ్డి బాబి, మండల ఉపాధ్యక్షులు కంకిపాటి వీరబాబు, దేవగుప్తం గ్రామ కమిటీ అధ్యక్షులు పొలమూరి బాబురావు, నాగిరెడ్డి సత్యనారాయణ, రొక్కాల.నాగేశ్వరరావు చికిలే చిట్టిబాబు, రవికిరణ్, వర్రే సూరిబాబు, వంగా నాయుడు, పిల్లా ప్రసాద్, కాకిలేటి హరికృష్ణ, నల్లా రాము,తిక్కా శ్రీరామ్మూర్తి, కంకిపాటి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

5న వైసిపి ఫీజు పోరు

'చలో అమలాపురానికి' పిల్లి సూర్య ప్రకాష్ పిలుపు



ప్రజాశక్తి - రామచంద్రపురం


ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పోరుబాటలో భాగంగా ఈ నెల 5న వైసిపి ఫీజు పోరు కార్యక్రమం తలపెట్టిందని వైసిపి రామచంద్రపురం ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5న తల పెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా ద్రాక్షా రామ బోసు బొమ్మ దగ్గర నుంచి బయలుదేరి విద్యార్థులు, తల్లిదం డ్రులతో కలిసి అమలాపురంలో జిల్లా కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా 'చలో అమలాపురం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్ర మానికి వైసిపి జడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, సర్పం చులు, ఎంపిటిసి సభ్యులు, మున్సిపల్ ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మన్, కౌన్సి లర్స్, కోఆప్షన్‌సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తరలి రావా లని ఆయన విజ్ఞప్తిచేశారు.విద్యార్థులకు వైసిపి అండగా ఉంటుందన్నారు.

చింతలూరు పాఠశాలలో 'బాల మందిరం'

ప్రజాశక్తి - ఆలమూరు

అంగర లక్ష్మీకాంతం(సాల్క్) ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహించే బాలమందిరం కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం చింతలూరు ఎంపిపి పాఠశాల నందు నిర్వహించారు. కవి, రచయిత అంగర గోపాలకృష్ణాచార్యులు(కష్ణశ్రీ) 3, 4, 5 తరగతుల విద్యార్థులకు సాహిత్య పఠనం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వాటిలో శిక్షణ ఇచ్చారు. కష్ణశ్రీ ఇచ్చిన సూచనలతో కేవలం చెప్పిన కథను ఆధారంగా చేసుకుని విద్యార్థులే వారు సొంతంగా మాటలు తయారు చేసుకుని వేసిన నాటకం అందరినీ ఆకట్టుకుంది. ఈ బాల మందిరం కార్యక్రమాన్ని మండలంలో ఉన్న అన్ని పాఠశాలలో నిర్వహిస్తామని కష్ణశ్రీ తెలిపారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్, సిఆర్ఎంటి అపర్ణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

కోడిపందేలు ఆడుతున్న నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి-కాజులూరు

గొల్లపాలెం శివారు ధనలక్ష్మి పేటలో కోడిపందేలు నిర్వహిస్తున్న సమాచారంతో దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్టు గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్ తెలిపారు. శుక్రవారం గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ దాడిలో ఒక కోడి, రెండు కత్తులు, రూ.1,520 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

ప్రజాశక్తి - ఆలమూరు

వాహన తనిఖీలలో భాగంగా మద్యం తాగి వాహనం నడుపుచున్న ముగ్గురు వ్యక్తులను ఎస్ఐ ఎం.అశోక్ అదుపులోనికి తీసుకొని శుక్రవారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండలంలో వివిధ రహదారి కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా అధిక మద్యం తాగి వాహనం నడుపుతూ కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లికి చెందిన అర్లపల్లి శ్రీరామకష్ణ, మండల కేంద్రానికి చెందిన పాండురాజుల భాస్కర్ గణేష్, మండలంలోని మడికికి చెందిన కుప్పిరెడ్డి శ్రీనులు పట్టుబడ్డారన్నారు. దీంతో ఆలమూరు కోర్టు మేజిస్ట్రేట్ వి.నాగేశ్వరావు నాయక్ ఒక్కొక్కరికి ఒక నెల రోజుల చొప్పున జైలు శిక్ష విధించారని ఎస్సై అశోక్ తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్

ప్రజాశక్తి-తాళ్లరేవు

మండలంలోని 216 జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం వ్యాన్ అదుపుతప్పి కాలవలోకి దూసుకుపోయింది. పెట్రోల్ బంకు జంక్షన్‌లో యూ టర్న్ తీసుకుంటున్న ఒక వ్యాన్‌ను తప్పించబోయి కాకినాడ నుంచి యానాం వైపు వస్తున్న శ్రీహరి డైలీ పార్సిల్ వ్యాన్ పక్కనే ఉన్న మురుగు కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో రోడ్డుపక్క చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారి బైకులు ధ్వంసమయ్యాయి. ఆ దుకాణాల వద్ద ఎక్కువ జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గ పరిధిలోని ఒక యువతి అదృశ్యంపై శుక్రవారం యానాం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక కనకాలపేట దంగుడుబియ్యం గంగాధర్ రావు ఇంట్లో అద్దెకు ఉంటున్న అనుబోని గోవిందరాజులు, పార్వతి కుమార్తె అనుబోని రమ్యశ్రీ (17) ఈ నెల 25వ తేదీ నుండి కనిపించడం లేదని తెలిపారు. రమ్యశ్రీ సుంకరపాలెం ప్రకాష్ జూనియర్ కాలేజీలో మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. కాలేజీకి పరీక్ష రాయడానికని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, ఆమె కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి అనుబోని పార్వతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్క్మి మురుగానందం తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం


సీతానగరం శెట్టిగళ్ళ వేటకు చెందిన బాలిక అదృశ్యమైందని సీతానగరం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. 16 ఏళ్ల బాలిక ఇంట్లో నుంచి బయటకు వెళ్లిందని, అప్పటి నుంచి కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

ఎస్ఐ గోపాలకృష్ణమూర్తి మృతితో కె.గంగవరంలో విషాదం

ప్రజాశక్తి - రామచంద్రపురం


గోపాలకృష్ణమూర్తి (ఫైల్)

తణుకు రూరల్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ గా పనిచేస్తున్న ఆదుర్తి గోపాల కృష్ణమూర్తి(45) శుక్రవారం తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దీనితో ఆయన స్వగ్రామమైన కె.గంగవరం మండలం కె.గంగవరం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కె.గంగవరంలోనే ఎరువుల వ్యాపారుస్తుడైన ఆదుర్తి గోపాలరావుకు ఇద్దరు కుమారులు. వారిలో చిన్నవాడైన గోపాలకృష్ణమూర్తి ఎస్ఐగా ఎంపికయ్యారు. ఆయన పశ్చిమమగోదావరి జిల్లాలోని ఆచంట, తణుకు పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐగా సేవలందించారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఎస్ఐ ఆత్మహత్య చేసుకున్నారన్న వార్తతో కుటుంబ సభ్యులంతా సంఘటనా స్థలానికి బయలుదేరారు. దీంతో కె.గంగవరం గ్రామంలో విషాదఛయలు అలుముకున్నాయి. శనివారం ఆయన అంత్యక్రియలు కె.గంగవరంలోనే నిర్వహిస్తారని బంధువులు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా

ప్రజాశక్తి - అమలాపురం

లింగ నిర్ధారణ కొరకు దుర్వినియోగం కాకుండా నివారించేందుకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై గట్టి నిఘా, డెకాయ్ ఆపరే షన్లు ముమ్మరం చేయాలని జెసి టి. .నిషాంతి అధికారులు కమిటీ సభ్యులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ లీగల్ స్త్రీ శిశు సంక్షేమం ఎన్‌జివోలతో జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర, డిసిహెచ్ఎస్ కార్తీక్, డిఐఒ బివివి. సత్యనారాయణ, ఫ్యామిలీ డాక్టర్ ఎం.సుమలత, అదనపు డిఎంహెచ్ఒ సిహెచ్.వి.భరత్ లక్ష్మి, డాక్టర్ పిఎస్.శర్మ, సిఐ శ్రీనివాసరావు సిడిపిఓ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భూముల ధరలకు రెక్కలు



- అర్బన్, రూరల్ ఏరియాల్లో 10 నుంచి 40 శాతం వరకు పెంపు
- పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీలు
- ఇప్పటికే పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం
- తాజా పెంపుతో పతనమేనంటున్న వ్యాపార వర్గాలు

ప్రజాశక్తి - రాజోలు

. కూటమి ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా ప్రజలపై మరో భారం మోపేందుకు రంగం సిద్ధం చేసింది. ఐదేళ్ళుగా రియల్ ఎస్టేట్ రంగం కునారిల్లిన సంగతి తెలిసిందే. ఇసుక కొరత నేపథ్యంలో అనుబంధ రంగమైన భవన నిర్మాణ రంగాన్ని ఇసుక కొరత కుదిపేసింది. ఈ పరిస్థితులను చక్కదిద్దుతామంటూ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కేవలం 7 నెలల్లోనే భూముల రిజిస్ట్రేషన్ ధరల పెంపునకు తెరతీసింది. ఈ నేపథ్యంలో 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెరగనున్నాయి. ఉదాహరణకు రాజోలు నియోజకవర్గంలో గల్ఫ్ దేశాలలో ఉపాధికోసం వెళ్ళి ఆర్థికంగా స్థిరపడిన వారి సంఖ్య ఎక్కువ దీంతో మలికిపురం ప్రాంతంలో భూముల ధరలు అధికం. ముఖ్యంగా మలికిపురం పట్టణంలో వాణిజ్య ప్రాంతంలో గజం ధర రూ.16 వేల వరకూ ఉంది. ప్రభుత్వం ధరలు పెంచితే అది రూ.18,400 అవుతుంది. రిజిస్ట్రేషన్ చార్జి, ఇతర ఫీజులు కలిపి ఇప్పటి వరకు రూ.1,200లు కాగా, ఇక నుంచి రూ.1,300 చొప్పున కానుంది. చదరపు గజం విలువ ప్రస్తుతం రూ.30 వేలు కాగా 15 శాతం పెరగటంతో రూ.34,500కు చేరనుంది. దీంతో సామాన్యులు 100 గజాలు కొనుగోలు చేస్తే అక్షరాలా రూ.4.50 లక్షలు భారం పడుతుంది. అమలాపురంలో రూరల్ ఎరియాలో ప్రస్తుతం చదరపు గజం ధర రూ.7,000 కాగా త్వరలో రూ.8,050కి చేరనుంది. ఇక్కడ కూడా 100 చదరపు గజాలు కొనుగోలు చేస్తే అక్షరాలా రూ.లక్ష భారం పడనుంది. మలికిపురం ఏరియాలో ప్రస్తుతం చదరపు గజం రూ.3,600 కాగా నేటి నుంచి10 శాతం పెరగడంతో రూ.3,960కి చేరనుంది. ఇప్పటికే ఒక వైపు ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు, పెరిగిన విద్యుత్ ఛార్జీలతో సతమతం అతున్న ప్రజలపై భూముల మార్కెట్ విలువ అమాంతం పెంచి దోచుకునేందుకు రంగం సిద్ధం చేసింది

నెలకు 70 వేల రిజిస్ట్రేషన్లు

ఇప్పటికే విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపిన కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచి భూముల విలువ పెంచుతూ మరో బాదుడుకు సిద్ధమైంది. పట్టణ, మండల కేంద్రాల శివార్లలోని వెంచర్లు, రోడ్డు పక్క స్థలాలు లక్ష్యంగా అర్బన్, రూరల్ ఏరియాల్లో రిజిస్ట్రేషన్ విలువ 10 నుంచి 40 శాతం వరకు పెంచుతూ ఆదేశాలిచ్చింది. ఈ మేరకు భూముల విలువలు భారీగా పెరగనున్నాయి. జిల్లాలో 12 వరుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా నెలకు 70 వేల వరకు రిజిస్ట్రేషన్లు ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.300 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. రిజిస్ట్రార్ విలువ ఆధారంగా రిజిస్ట్రేషన్ చార్జీలను నిర్ణయిస్తారు. ఆస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్లపై స్టాంపు డ్యూటీ, ఛార్జీల నిమిత్తం 7.5 శాతం, సెటిల్‌మెంట్, గిఫ్ట్ రిజిస్ట్రేషన్లయితే 2.5 శాతం, పార్టేషన్ రిజిస్ట్రేషన్ అయితే ఒక శాతం, మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్ అయితే లోన్‌పై 0.6 శాతం వరకు ప్రభుత్వానికి చెల్లించాలి.

ఇప్పటికే పన్నులు పెంచేశారు

ఇప్పటికే నిర్మాణాల విలువను ప్రభుత్వం ఖరారు చేసి ఉత్తర్వులిచ్చింది. కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల వారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ నిర్మాణాలు, నాన్ ఆర్‌సిసి రూమ్లలతోపాటు పూరిళ్ళు, గోడలు లేని ఇళ్ల విలువనూ పెంచేసింది. కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో ఉన్న అపార్టుమెంట్లలోని ఫ్లాట్లు, నివాస భవనాలకు చదరపు అడుగు విలువను రూ.1,490కి పెంచింది. నగర పంచాయతీల్లో చదరపు అడుగు రూ.1,270, గ్రామ పంచాయతీల్లో చదరపు అడుగుకు రూ.900కు పెంచింది. సెల్లార్, పార్కింగ్ ఏరియాతోపాటు ప్రతి అంతస్తులో అదనపు ఫ్లోర్లకు రేటు పెంచారు. వాణిజ్య భవనాల విలువను కార్పొరేషన్లు, మున్సిపాల్టీల్లో రూ.1,800కు, నగర పంచాయతీల్లో రూ.1,540కి, పంచాయతీల్లో రూ.1060కు పెంచారు. ఇతర ఆర్‌సిసి నిర్మాణాలే కాకుండా ఆర్‌సిసి రూఫ్ల లేని ఇళ్ల విలువను సైతం పెంచేశారు. చివరికి పెంకుటిళ్లు, పాకలు, గోడలు లేని ఇళ్లను సైతం వదలకుండా వాటి విలువను చదరపు అడుగుకు రూ.5 నుంచి రూ.20 వరకూ పెంచింది. అన్ని రకాల నిర్మాణాల్లోనూ ఎస్ఎఫ్ఎ రేటు రూ.30 నుంచి రూ.90 వరకు పెంచారు.

భారీగా పెరగనున్న ఛార్జీలు

సవరించిన ధరలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. జిల్లాలోని అర్బన్ ఏరియాల్లో 35 శాతం, రూరల్‌లో 40 శాతం వరకు భూముల విలువలు పెరుగుతున్నాయి. అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో 20 శాతానికి పైగా, అధిక శాతం మండలాల్లో 30 శాతానికి పైగా పెరిగాయి. ఈ మేరకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా పెరుగుతాయని వివిధ వర్గాలు అంటున్నారు. తాజా పెంపుతో అమలాపురం, రావులపాలెం,కొత్తపేట తదితర కొన్ని పట్టణ ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే ప్రభుత్వ ధర ఎక్కువగా ఉన్నట్టు చెబుతున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి


నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని నగరపంచాయతీ ఛైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. . నగర పంచాయతీ కార్యాలయం సమావేశపు హాలు నందు శుక్రవారం ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ అమలులో ఉన్న అజెండాను ప్రవేశపెట్టకుండా సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. నగర పంచాయతీ ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకష్ణ మాట్లాడుతూ పేదలు ఇల్లు కట్టుకునేందుకు ఇచ్చే పొజిషన్ సర్టిఫికెట్స్ జారీ చేయడానికి రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుంటూ లబ్ధిదారులను ఇబ్బంది పెడుతున్న రెవిన్యూ అధికారుల తీరుపై న మండిపడ్డారు. అలాగే నగర పంచాయతీ పరిధిలో పలు వార్డులలో ట్రాన్స్ఫుర్మర్లు పొదలతో నిండిపోయి ఉన్నా విద్యుత్ శాఖసిబ్బంది, అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని, పొదలపై పిర్యాదు చేసిన స్పందించకపోవడంతో ఎప్పుడు ఎ ప్రమాదం సంబవిస్తుందోనని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రాణ భయంతో గడుపుతున్నారని జూనియర్ ఇంజినీర్ దష్టికి తీసుకువచ్చారు. వార్డు సచివాలయం పరిధిలోని సంబంధిత సిబ్బంది ఫిర్యాదు చేసినా స్పందించక పోవడం దారుణమన్నారు.అన్ని అనుమతులతో నిర్మించుకున్న గహలకు మీటర్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఛైర్మన్ కల్పించుకుని విద్యుత్ శాఖ అధికారులు తీరు మార్చుకోవాలని ఆదేశించారు. ఏడో వార్డు కౌన్సిలర్ గంజా శ్రీనివాస్ మాట్లాడుతూ గహ రుణాల మంజూరుకు గతంలో ఎంపిక చేసిన లిస్ట్ ప్రకారం చేస్తున్నారా లేక కొత్త లిస్ట్ ప్రకారం ఎంపిక చేస్తున్నారా అని హౌసింగ్ ఎఇ సుబ్రహ్మణ్యం ను ప్రశ్నించారు. గతం లిస్టు, కొత్త లిస్టు ప్రకారం ఎంపిక చేస్తున్నామని తెలపగా, దరఖాస్తుదారుల నుంచి రూ.3వేలు దళారుల ద్వారా వసూళ్లు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని కౌన్సిలర్ నిలదీశారు. లబ్ధిదారుల ఎంపిక లిస్టును సంబంధిదిత కౌన్సిలర్లకు ఎందుకు తెలపడం లేదని ప్రశ్నించారు.తొమ్మిదో వార్డు కౌన్సిలర్ అడబాల సతీష్ కుమార్ శానిటేషన్ లేకపోవడంతో ప్రజలు వ్యాధుల భారిన పడుతున్నారని అన్నారు. రోడ్లపై పశువులు, పందులు, కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారని వీటి నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీ, స్కూల్స్‌లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. 17వ వార్డు కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ నగర పంచాయతీ ఇంజినీర్ సుధాకర్ పని తీరుతో సమస్యలు త్వరతగతిన పరిష్కరానికి నోచుకుంటున్నాయని ఎఇని అభినందించారు. 13వ వార్డు కౌన్సిలర్ కోటుం జయలక్ష్మి వార్డు ప్రజలకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, పంపు హౌస్ కీపర్‌ని అడిగడానికి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడని, లిఫ్ట్ చేసిన సమాధానం చెప్పడని, పని చేసే వారిని నియమించాలని కౌన్సిల్ దష్టికి తీసుకువచ్చారు. ఛైర్మన్ కల్పించుకుని పంపు హౌస్ కీపర్ పై ప్రజల నుండి ఆరోపణలు వస్తున్నాయని అతడిని అక్కడి నుండి తప్పించి, మంచి వర్కర్ ను నియమించాలని కమిషనర్‌ను ఆదేశించారు. 19వ వార్డు కౌన్సిలర్ సౌజన్య మాట్లాడుతూ నగర పంచాయతీ కి సమాకురే రాబడి వివరాలు అడిగితే, కనీసం కౌన్సిల్ సభ్యులకు ఇవ్వడం లేదని మండిపడ్డారు. దీనికి కమిషనర్ సమాధానమిస్తూ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చానని తెలిపారు. అనంతరం నగర పంచాయతీ ఇంజినీర్ సుధాకర్‌ను కౌన్సిలర్లు సత్కరించారు.

అభివృద్ధి ఫలాలు అందరికీ చేరాలి

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి అభివద్ధి ఫలాలు అందరికి చేరేలా కషి చేయాలని ముమ్మిడివరం ఎంపిపి కోలా గంగాభవాని పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలు నందు శుక్రవారం ఎంపిపి గంగాభవాని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను ఆయా గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పలు శాఖల అధికారులు తమ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. సమావేశంలో ఎంపిడిఒ తాడి శ్రీ వెంకటాచార్య, పంచాయతీ రాజ్ డిఇఇ విజయ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఎంఎల్ఎ సుబ్బరాజుకు వినతిపత్రం అందజేస్తున్న టైలర్స్అసోసియేషన్

నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

టైలర్ ఫెడరేషన్‌లకు, సొసైటీలను బలోపేతం చేసేందుకు నిధులను మంజూరు చేయాలని బాలయోగి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. టైలర్స్ అసోసియేషన్ శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో సత్యనారాయణ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు స్వామి ముఖ్య అతిధిగా పాల్గొని టైలర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు, రజక ఫెడరేషన్‌లకు ఇస్తున్న విధంగా సబ్సిడీ తో కూడిన విద్యుత యూనిట్ల ను అమలు చేయాలని, టైలర్ ఫెడరేషన్ అభివృద్ధి కి నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తీర్మానించారు. అనంతరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లోపలువురు టైలర్స్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకరాం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జిఎంసి బాలయోగి జడ్‌పి బాలికోన్నత పాఠశాలకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో సమాకూర్చిన ఆర్‌ఓ ప్లాంట్ ను శుక్రవారం ఎంఎల్ఎ సుబ్బరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, దాతలు విరివిగా సహకారం అందించి అభివద్ధి కి సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల, కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, మద్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ కార్పొరేషన్ రిటేల్ వ్యాపార ఎస్‌సివిసిసి జెబిడి.వర్మ తో పాటు చెల్లి అశోక్, గోలకోటి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం నుంచి తప్పకుంటున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

విద్యారంగం నుంచి ప్రభుత్వాలు తప్పుకుంటున్నాయని, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ నిధులను విడుదల చేయడంలో జాప్యం చేస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నాయని పిడిఎస్ యు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి వి.భీమశంకరం, పివైఎల్ నాయకులు అంబటి కష్ణ, ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి మాట్లాడుతూ దేశంలో విద్యారంగం తీవ్ర సంక్షేమంలో కూరుకు పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మూసివేతకు తెచ్చిన జిఒ 84, 85 ,117 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌పి ప్రకటించి 50 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వాల కషి చేయాలని,‾ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర, దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ, అఖిలభారత విద్య హక్కుల వేదిక, ఎపిటిఎఫ్ 1938, పిడిఎస్‌యు, డిటిఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జనవరి 26 నుంచి మార్చి 31 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చాయని వివరించారు.

8,858 ఎకరాల్లో దాళ్వా వరి సాగు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో 8858 ఎకరాల్లో రైతులు దాళ్వా వరి సాగు చేస్తున్నారని మండల వ్యవసాయ అధికారి కె.సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు వెదజల్లే పద్ధతిలో దాళ్లా వరి సాగు చేస్తున్నారన్నారు. మినుము 120 ఎకరాల్లో, పెసర 5 ఎకరాల్లో, మొక్కజొన్న 98 ఎకరాల్లో, వేరుసెనగ 14 ఎకరాల్లో రైతులు దాళ్వాలో సాగు చేస్తున్నారన్నారు.

కూటమి ప్రభుత్వంపై విమర్శలు హాస్యాస్పదం

ప్రజాశక్తి - కొత్తపేట

కూటమి ప్రభుత్వంపై వైసిపి నేతలు చేస్తున్న విమర్శలు హాస్యాస్పదమని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వైసిపి విధ్వంసపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడి సుపరిపాలన వైపు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్న కూటమి ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేయడానికే వైసిపి నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారనీ విమర్శించారు. ఫీజు పోరు పేరుతో పోస్టర్ విడుదల కార్యక్రమం చేపట్టి ఎన్డీఏ ప్రభుత్వంపై వైసీపీ నేతలు చేసిన ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు.

రేపు మూడు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రాపురం సబ్‌స్టేషన్ కెవి132 లో విద్యుత్ పరికరాలు మార్పు చేస్తున్నామని ఈ కారణంగా మూడు మండలాల్లో ఆదివారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఏపీ ట్రాన్స్‌కో ఇఇ ఖాజా రహంతుల్లా, రామచంద్రవురం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. కె.రత్నాలరావు సయుక్తంగా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల కె.గంగవరం మండలం, రాయవరం మండలం, రామచంద్రపురం మండలాల్లో గల పరిసర ప్రాంతాల్లోనూ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కె.గంగవరం

గ్రామాల్లో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకుని తద్వారా తయారయ్యే సేంద్రియ ఎరువులను అమ్మడం ద్వారా ఆదాయం పెంచుకోవాలని డిపిఒ శాంతకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం కె.గంగవరం మండలంలో గల గ్రామపంచాయతీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. తడి చెత్త పొడి చెత్త వల్ల తయారయ్యే ఎరువులు వల్ల రసాయనాలు పదార్థాలు ఉండవని తద్వారా ఆరోగ్యవంతమైన పంటలు పండించడం సాధ్యమవుతుందని అన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పండించిన పంటల వల్ల పిల్లల్లో మానసిక ఎదుగుదల బాగుంటుందని, అంగవైకల్యాలను నివారించవచ్చని ఆమె సూచించారు. స్వయంగా చెత్త నుండి సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. గ్రామ కార్యదర్శి రఘురాం, సర్పంచ్ కోటి నరసమ్మ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మూక్ నాయక్ పత్రిక ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం


నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో శరత్ ఆధ్వర్యంలో మూక్ నాయక్ 105వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గౌతమ బుద్ధుడు, డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి సామాజిక కార్యకర్త సఖిలే పథ్వీరాజ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పృథ్వీరాజ్ఆయన మాట్లాడుతూ నోరుండి తమ సమస్యలను చెప్పుకోలేని వారి కోసం ఏర్పడిన మొట్టమొదటి పత్రిక మూక్ నాయక్ పత్రిక అని అన్నారు. కార్యక్రమంలో వడ్డీ నాగేశ్వర రావు,నల్లా సూర్య ప్రకాష్, వెంకట రమణ, పెద బాబు, పండుబాబు తదితరులు పాల్గొన్నారు.


దాతకు స్వామి వారిచిత్రపటం అందజేస్తున్న ఆలయ సహాయ కమిషనర్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు హైదరాబాద్ వాసులు ఏరువ కేశవరెడ్డి, లక్ష్మి కుటుంబ సభ్యులు శుక్రవారం రూ 1,02,000 విరాళంగా అందజేశారని బ ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు. దాతలు ముందుగా శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారన్నారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రముతో సత్కరించి స్వామి వారి చిత్రపటము, ప్రసాదం అందజేసారన్నారు.


బహుమతులు అందజేస్తున్న పూర్వ విద్యార్థుల అసోసియేషన్

విజేతలకు నగదు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - మామిడికుదురు

మామిడికుదురు హైస్కూల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ తరపున మండల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ పోటీల్లో విజేతలకు శుక్రవారం నగదు బహమతులు అందజేశారు. మామిడికుదురు హై స్కూల్ టెన్త్ విద్యార్థి ఎం.సింధుకు రూ.2 వేలు, ద్వితీయ విజేత ఈదరాడ హైస్కూల్ టెన్త్ విద్యార్థి ఎల్.చరణ్‌కు రూ.1,500 అందజేశారు. పాఠశాల స్థాయిలో 6 నుంచి 10 వరకు నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానములో నిలిచిన విద్యార్థికి రూ.1,500 ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.వెయ్యి రూపాయలు నగదు ను పూర్వ విద్యార్థి పిల్లి వెంకటస్వామి జ్ఞాపకార్థం అందచేశారు. 2024 25 టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మొదటి స్థానములో నిలిచిన బాలుర విభాగంలో పోతుల రాహుల్, బాలికల విభాగంలో కాండ్రేగుల ఇంద్రాలక్ష్మీ లకు ఒక్కొక్కరికి రూ.2,500 నగదు బహుమతులు లు ను పాఠశాల పూర్వ విద్యార్థి కడలి వీర వెంకట గోపాలకృష్ణ, రిటైర్డ్ జిఎం బిహెచ్ఇఎల్ హైదరాబాదు వారి సౌజన్యంతో అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎంలు యరుబండి లక్ష్మయ్య, మైలవరపు రవీంద్రనాథ్, నయినాల వేణుగోపాల్, కంచి సత్యనారాయణ, నన్నేసా హుస్సేన్ కటకంశెట్టి సోమశేఖర్ రావు, నయనాల వెంకటేశ్వరరావు, నయనాల తమ్మారావు, హైస్కూల్ హెచ్ఎం సిహెచ్.నిరంజని తదితరులు పాల్గొన్నారు.

126 పశువులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

వేలంపాలెంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ మేడిశెట్టి కష్టార్జున ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 126 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మందులు, మినరల్ మిక్సర్ ప్యాకెట్లను అందజేశారు. పరిసర ప్రాంతాలు రైతులు పశువులను తీసుకువచ్చి వైద్య శిబిరంలో వైద్య సేవలు వినియోగించుకున్నారు. పశు వైద్య సిబ్బంది ఈ కార్యక్రమంలో సేవలు అందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాక్ కమిటీ ఛైర్మన్ కులకర్ణి

అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - మండపేట

విద్యార్థుల భవిష్యత్తు అధ్యాపకుల చేతిలో ఉంటుందని, అధ్యాపకులందరూ అంకిత భావంతో పనిచేయాలని నాక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కులకర్ణి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా విషయక అంశాల పరిశీలనకు గురువారం నాక్ బందం ప్రతినిధులు వచ్చారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలోనాక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కులకర్ణి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికెవి శ్రీనివాసరావు నాక్ బృందం ప్రతినిధులు వచ్చిన వివరాలను తెలియజేశారు మూడు రాష్ట్రాల నుండి వచ్చిన ముగ్గురు ప్రతినిధుల బృందం రెండు రోజుల పాటు కళాశాలలో విద్యా సంబంధమైన విషయాలతో బాటు కళాశాల మౌలిక వసతుల కల్పన, మొదలగు విషయాలను పరిశీలించినట్లు, గ్రేడ్ ను ప్రకటించ నున్నట్లు ఆయన తెలిపారు.బందం కళాశాలలో వివిధ విభాగాలను పరిశీలించి, విద్యార్థుల తల్లి తండ్రులు, కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించా పలు అంశాలను ఆరా తీసిందన్నారు.గత మూడు సంవత్సరాలలో కళాశాలలో చేసిన అభివద్ధి సోలార్ పవర్ ప్లాంట్ , ఎసి లైబ్రరీ, కళాశాల గ్రౌండ్ అభివద్ధి, బొటానికల్ గార్డెన్ల ఏర్పాటు తదితర అంశాలను నాక్ బందానికి తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆనంద్, ఐక్యూఎసి కో ఆర్డినేటర్ కిరణ్, అధ్యాపకులు డాక్టర్ నెహ్రూ నాయక్, డాక్టర్ శంకర్, గోపాలకష్ణ, సుందర్, రాజేష్, అభినయ్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


పాల్గొన్న పలువురు నాయకులు తదితరులు

ఘనంగా గద్దర్ జయంతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, మాత రామాభాయ్ మహిళా సంఘాలు సంయుక్తంగా వడ్డీ నాగేశ్వర రావు అధ్యక్షతన విప్లవ గాయకుడు గద్దర్ 77వ జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్, గద్దర్ చిత్రపటాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పుణ్యమంతుల రజని, జంగా తనూజ, ఈతకోట గౌరి, ఆంజనేయులు, సిద్ధార్థ కుమార్, నరేష్ కుమార్, కాశి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని డిమాండ్

ప్రజాశక్తి - అమలాపురం

వడ్లకొండ కృష్ణ హత్యకు కారణమైన నిందితులను తెలంగాణ ప్రభుత్వం శిక్షించాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గడియారం స్తంభం సెంటర్ లో విసికె పార్టీ (ఎపి) రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ సూర్యాపేట పేట కు చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ (మాల బంటీ), భార్గవి ని ప్రేమ వివాహం చేసుకున్నారని, ఈ కారణం గా ఈ నెల జనవరి 26న భార్గవి కుటుంబ సభ్యులు వడ్లకొండ కృష్ణ ను హత్య చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా దళిత సంఘాలు నిరసన తెలిపార. వడ్లకొండ కృష్ణ కుటుంబానికు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు గిడ్ల వెంకటేశ్వరరావు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, బిఎస్‌పి నాయకులు పొలమూరి మోహన్ బాబు, ఆర్‌పిఐ పార్టీ నాయకులు ఎలిపే సత్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు ఊటాల వెంకటేష్, మోకా శ్రీను, డేవిడ్ అంబేద్కర్, సాపే రమేష్, వాకపల్లి హరీష్ తదితరులు పాల్గొన్నారు.